
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 17 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.22 సహరి: 4.48
సోమవారం సాయంత్రం మంగళవారం ఉదయం

ఆరేళ్ల వయసులోనే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు బాలిక ఎంపిక 7



అమలాపురంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(పాత చిత్రం)

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- జిల్లాలో పరీక్షలకు హాజరుకానున్న 19,217మంది విద్యార్థులు
- 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు.. 144 సెక్షన్ విధింపు

(అమలాపురం, ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సర్వసన్నద్ధమైంది. పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తిచేశారు. ఈనెల 17 నుంచి 31 వరకు పరీక్షలు జరుగుతాయి. 31న రంజాన్‌వస్తే ఆ పరీక్షను ఏప్రిల్ 1న నిర్వహిస్తామన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను డీఈవో షేక్ సలీంబాషా పరిశీలించారు.

జిల్లాలోని 22 మండలాలు, 3 మున్సిపాలిటీలు, ఒక నగరపాలక సంస్థ పరిధిలో పరీక్షలకు హాజరయ్యే కోసం 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదోతరగతి పరీక్షలకు 19,217మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 9,623మంది, బాలికలు 9,594మంది ఉన్నారు. పరీక్షలకు సంబంధించి ఏ-కేటగిరీలో ఏమీలేవు. బీ-కేటగిరిలో 59 పరీక్షా కేంద్రాలు, సీ-కేటగిరిలో 51 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి.

పదో తరగతి పరీక్షల పరిశీలన కోసం జిల్లాకు పరిశీలనాధికారిగా మువ్వా రామలింగాన్ని నియమించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 35 సిటింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షలనిర్వహణకోసం 785మందిఇన్విజిలేటర్లను నియమించారు. అదనంగా 215 మందిని ఉంచారు. 110 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 110మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. గతంలో మాదిరిగా జిల్లాలో ఓపెన్ స్కూల్‌కు సంబంధించి పదోతరగతి పరీక్షలకోసం హాజరయ్యే 1162మంది విద్యార్థులకోసం 19సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుంది. ఒక్కో పరీక్షకు 3 గంటల 15 నిమిషాలు సమయం కేటాయించారు. ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంటలనుంచి 11.30గంటలవరకు జరుగుతాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగాప్రయాణించవచ్చు. మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా పరీక్ష రాయాలని నిపుణులు సూచిస్తున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పదో తరగతి పరీక్షల నిర్వహణకు ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు ద్వారా పర్యవేక్షణ చేస్తాం. పరీక్షల నిర్వహణలో ఏ ఇబ్బందులు తలెత్తినా కంట్రోల్ రూం నెంబర్ 9493819102కు తెలియచేయాలి. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసి స్క్వాడ్‌లను నియమించాం.

-షేక్ సలీంబాషా, డీఈవో



స్థానిక సంస్థలకు కూటమి తీపికబురు

- ప్రభుత్వం ఆర్థిక స్వేచ్ఛ
- ఎవరివి వారే ఖర్చు చేసుకోవచ్చు
- బిల్డింగ్ ప్లాన్స్ మునిసిపాలిటీకే
- పదేళ్ల ఇబ్బందులకు చెల్లుచీటి

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 16(ఆంధ్రజ్యోతి) : కూటమిలో స్థానికతకు పట్టం కట్టారు..ఆర్థిక స్వేచ్ఛకు ఊతమిచ్చారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ చొరవతో మునిసిపాలిటీల ఎన్నో ఏళ్ల కల సాకారమైంది.రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు,నగర పంచాయతీలకు ఆర్థిక స్వాతంత్ర్య లభించింది. ఇకపై చెత్త తొలగించాలన్నా, నీటి కుళాయి మరమ్మతు చేయాలన్నా, వీధి లైటు వేయాలన్నా, రోడ్లపై గుంతలు పూడ్చాలన్నా, నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైపు చూసే దయనీయ స్థితి తప్పింది. రాష్ట్రంలో పదేళ్లగా మునిసిపాలిటీల ఆదాయంలో ప్రతి పైసా సీజేఎఫ్ఎస్‌లో జమచేసేవారు. స్థానిక అవసరాలకు నిధులు రాబట్టుకోవడం అనేది సీజేఎఫ్ఎస్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేది. పన్నుల ద్వారా మునిసిపాలిటీలకు వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకునేది. స్థానిక సమస్యల పరిష్కారానికి నిధులు ఉండేవి కావు.కరోనా సమయంలో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు

అసెంబ్లీలో ఆర్థిక బిల్లు ఆమోదం

స్థానిక అవసరాలకు ఖర్చు చేసుకున్న నిధులు తమ ఆదాయం నుంచి విడుదల చేయాలని మునిసిపాలిటీలు రెండేళ్ల కిందట పెట్టుకున్న బిల్లులకు ఇప్పటి వరకు మోక్షం లేదు. దీంతో మునిసిపాలిటీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. నిజానికి 73,74 రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు 29 అధికారాలు ఇవ్వాలని నిర్ణయం జరిగింది. ఎమ్మెల్యేలు నిధులపై ఆధిపత్యం కోసం పంచాయతీలు, మునిసిపాలిటీలకు అధికారాలు బదలాయించడం లేదు.దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి.దేశంలో స్థానిక సంస్థలకు అధికారాలను బదలాయించిన రాష్ట్రంగా కేరళ మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆ బాటలో నడుస్తోంది. మునిసిపల్ శాఖ మంత్రిగా నారాయణ బాధ్యతలు చేపట్టడంతో ఆయన పాత ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.మునిసిపాలిటీలు బాగుపడాలంటే వాటికి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని వాటి ఆదాయాన్ని వాటి వద్దే ఉంచాలని ఆయన ప్రభుత్వ పెద్దలను ఒప్పించగలిగారు.దీంతో మునిసిపాలిటీలకు ఆర్థిక స్వాతంత్ర్యం బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. మున్సిపాల్టీలకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం స్థానిక సంస్థల వద్దే ఉంటుంది.అవసరాలకు ఖర్చు చేసుకునే అధికారం ఉంటుంది.

2019లోనే ప్రతిపాదన..

స్థానిక సంస్థలకు ఎన్నో అవసరాలు ఉంటాయి.. నిధుల్లేకపోతే ఇబ్బందే. ఈ మేరకు మొదట 2014-19లో మునిసిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన పొంగూరు నారాయణ వారి నిధులు వారివద్దే ఉంచాలనే ప్రతిపాదన ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లారు. అప్పటికే ఎన్నికల సమయం దగ్గరపడడంతో ఈ ప్రతిపాదనలు మూలనపడ్డాయి.దీంతో గత ఐదేళ్ల పాత పద్ధతే కొనసాగింది. పన్నుల రూపంలో వచ్చిన మునిసిపాలిటీల ఆదాయాన్ని గత వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడంతో గడిచిన ఐదేళ్ల పురపాలికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. మునిసిపాలిటీల్లో పనులకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదు.ఈ కారణంగానే ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో గత ఐదేళ్లలో రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చలేకపోయారు.

ప్లాన్ అప్రూవల్ సరళతరం

ఈ కొత్త బిల్లులో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌ను సరళతరం చేయడంతో పాటు ఉల్లంఘనలు జరిగితే చర్యలు తీసుకోవడానికి వీలుగా చట్టం చేశారు. ఇప్పటి వరకు మునిసిపాలిటీల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌కు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపేవారు. ఇప్పుడు దాన్ని రద్దు చేశారు. మునిసిపాలిటీలే నేరుగా అప్రూవల్ ఇచ్చే వెసులుబాటు కల్పించారు. దీని వల్ల అప్రూవల్స్ వేగవంతమవుతాయి. ప్లాన్ ఉల్లంఘించి నిర్మాణాలు జరిగితే వాటిని కూల్చే అధికారం మునిసిపాలిటీలకు ఇచ్చారు. అందుకు అంగీకరిస్తూ భవన యజమాని అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని వల్ల నిర్మాణాల్లో ఉల్లంఘనలు కట్టడి కానున్నాయి.

ఆదివారం వచ్చిందంటే ముక్కలేనిదే ముద్ద దిగదు.. కంచంలో చికెన్ ముక్క. లేదంటే చేప ముక్కడబ్బులు ఎక్కువగా ఉంటే మటన్ ముక్క ఉండాల్సిందే.. అయితే బర్డ్ ఫ్లూ కారణంగా చాలా మంది చికెన్‌కు దూరంగా ఉంటున్నారు.. కోళ్ల వ్యర్థాలను చేపలకు వేస్తున్నారని తెలిసిన వాళ్లు అవీ తినేందుకు ఇష్టపడంలేదు.. ఇక మిగిలింది మటన్ ఒకటే.. దీంతో జనం చికెన్.. ఫిష్ వదిలేసి.. మటన్ వైపు చూస్తున్నారు.. షాపుల ఎదుట క్యూ కడుతున్నారు.. మరి మటన్ అయినా నాణ్యతగా ఉంటుందా అంటే అదీ అనుమానమే.. ఎందుకంటే ఎక్కడా తనిఖీల్లేవ్.. నిల్వ మాంసం విక్రయించినా పట్టించుకునేవారే లేరు.. మేక మాంసం అని అడిగితే గొర్రె మాంసం అంటగట్టేసినా అడిగేవారులేరు.. దీంతో వ్యాపారుల ఇష్టానుసారంగా మారిపోయింది.. ధరలపై నియంత్రణ లేదు.. తనిఖీలు లేవు.. ఇచ్చుకో.. అమ్ముకో అనే రీతిన ఉంది పరిస్థితి..



ముక్కాంశాలు!

చికెన్ ముక్క దిగదు.. మటన్ ధర మాట వినదు..

- మటన్‌లో..బోలెడు మోళీలు
- 90 శాతం గొర్రె మాంసమే విక్రయం
- బర్డ్ ఫ్లూతో తగ్గిన చికెన్ వినియోగం
- అమాంతం పెంచేస్తున్న ధరలు
- మొన్నటి వరకూ కిలో రూ.800
- ఇప్పుడు రూ.1300
- ఎక్కువ నిల్వ మాంసమే అమ్మకం
- మామూళ్ల మత్తులో..తనిఖీల్లేవ్
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- పట్టణాలు.. గ్రామాల్లోనూ ఇంతే

కార్పొరేషన్(కాకినాడ)/రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ తినేందుకు జనం ఇష్టపడంలేదు.. ఒకనాడు ఆదివారం వచ్చిందంటే చికెన్ షాపులు జనంతో కిటకిటలాడేవి.. మరి నేడు అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడంలేదు..వైద్యులు ఉడికించిన చికెన్ తిన్నా ఇబ్బందిలేదన్నా ఎందుకో దూరం పెట్టారు. చాలా తక్కువ శాతం మంది మాత్రమే ఇప్పుడిప్పుడే చికెన్ కొనుగోలు చేస్తున్నారు.. దీంతో ఇప్పుడు చూపంతా మటన్ వైపే ఉంది. దీంతో ధర అమాంతం పెంచేశారు. దీంతో మాంసాహార ప్రియులు హుష్ అంటూ నిట్టూరుస్తున్నారు.కోళ్లకు బర్డ్‌ఫ్లూ పుణ్యమాని.. మటన్ ధర అమాంతం పెరిగిపోయింది.. ఇదిలా ఉండగా సందట్లో సడేమియా అన్నట్టు మేక, గొర్రెల



మాంసంపై తనిఖీలు కరువయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వినియోగం పెరిగినా ..అధిక శాతం జనం మోసపోతూనే ఉన్నారు. మటన్ ధరలు ఇంకా పెరగవచ్చనే అంచనాల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

90 శాతం గొర్రె మాంసమే..



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మటన్‌లో 90 శాతం గొర్రె మాంసమే ఉం టోంది. మేక మాంసం చాలా తక్కువగా లభ్యమవుతోంది. గొర్రెల పెంపకమే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో గొర్రెల సంతలే జరుగుతాయి. మేకల సంతలు అత్యంత అరుదుగా ఉంటాయి. దీంతో మేక మాంసం అని చెబుతూ గొర్రె మాంసాన్ని విక్రయిస్తున్నారు. మేక, గొర్రె మాంసం అమ్మకాలపై ఎలాంటి తనిఖీలు, చర్యలూ, ధరల నియంత్రణా లేదు. ఒక కిలో మాంసం ఎలా ఉండాలనే నిబంధనలేమీ లేవు.దీంతో ఇష్టానుసారం అమ్మకాలు సాగిస్తున్నారు. ధరల పట్టిక షాపుల వద్ద కనిపించడం లేదు.

అమాంతం మటన్ ధర పెంపు

ఉమ్మడి తూర్పులో సుమారు 5 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయని కాగితాలపై లెక్కలు చెబుతున్నా మటన్ ధర దూసుకుపోతోంది.. బర్డ్ ఫ్లూ కారణంగా జనం చికెన్ వైపు చూడడానికే ఇష్టపడంలేదు. దీంతో ప్రతి ఆదివారం మటన్ అమ్మకాలు పెరిగాయి.ఈ నేపథ్యంలో ఇష్టానుసారం ధరలు పెంచేస్తున్నా నియంత్రణే కరువైంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ స్లాటర్ హౌస్‌లలో ఆదివారం సుమారు 2 వేల గొర్రెలు, మేకలను వధిస్తున్నారు. మిగతా రోజుల్లో ఆ సంఖ్య 500 ఉంటుంది. ఉమ్మడి తూర్పులో నెలకు సుమారు 200 టన్నుల వరకూ అమ్మకాలు ఉండే మటన్ అమాంతంగా 500 టన్నుల వరకూ పెరిగింది.దీంతో ఒక్కసారిగా ధరలు పెంచేశారు.నెల కిందట వరకూ కిలో రూ.800 ఉండే ధర ఇప్పుడు గరిష్ఠంగా రూ. 1000 నుంచి రూ.1300కి చేరింది. అంటే వంద గ్రాములు కావాలంటే రూ.130 వెచ్చించాల్సిందే. ఇక శాల్తీలు కావాలంటే వామ్మో అనాల్సిందే. టిల్లీ ఒకటి రూ.200 (50-100గ్రాములు ఉం టుంది), దబ్బ(లంగ్స్) రూ.120, బోటీకి రూ.300, లివర్ కిలో రూ.1500 చెల్లించాల్సిందే. దుమ్ములను కూడా కిలో రూ.800కి అమ్ముతున్నారు. బాలింతలకు మటన్ దూరమైపోయింది.

మటన్ ధరపై నియంత్రణేది..

ఉమ్మడి జిల్లాలోని మాంసం విక్రయ దారులకు లోకల్‌గా మేకలు,గొర్రెల లభ్యత సరిపోవడం లేదు. దీంతో శ్రీశైలం, కర్నూలు జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని షోలాపూర్, కర్ణాటకలోని బళ్లారి ప్రాంతాల్లో జరిగే సంతలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.దీంతో రవాణా చార్జీలు వినియోగదారులు భరించక తప్పడం లేదు. ధరల నియంత్రణపై యంత్రాంగం దృష్టి పెట్టడం లేదు.ఉమ్మడి జిల్లాలో 5 లక్షల వరకూ గొర్రెలు, మేకలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నా వాస్తవంలో అలా లేదు.డిమాండ్ కు తగిన ఉత్పత్తి లేక వ్యాపారులు ధరలను పెంచేస్తున్నారు. అధికారులు అదుపు చేయలేకపోతున్నారు.

జబ్బు పడినవీ కొనుగోలు..

సంతల్లో జబ్బుపడిన మేకలు,గొర్రెలు 70 శాతం తక్కువకు విక్రయిస్తుంటే విక్రయదారులు కొనుగోలు చేస్తారు. రవాణాలోనే చనిపోతే కోసేసి మాంసాన్ని ఐస్ బాక్సుల్లో వేసి తీసుకొస్తారు. రాజమహేంద్రవరం జాంపేట, కాకినాడ,అమలాపురంలోని ప్రధాన మాంసాహార మార్కెట్లలో అర్థరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 3 గంటల మధ్యలో దింపుతారు.వధించడానికి అనువుగా లేని మేకలున్నా కమేళాలో కాస్త సొమ్ము ముట్టజెప్పి పనికానిచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక రౌండ్ సీల్‌ని కొందరు బడా వ్యాపారులు చట్టానికి విరుద్ధంగా తయారు చేయించేసుకొని.. షాపు వద్ద కోసేసే జంతువులకు వాళ్లే రౌండ్ సీల్ వేస్తున్నారని చెబుతున్నారు.

అధికారుల తనిఖీల్లేవ్...

మాంసాభివృద్ధికి మీట్ కార్పొరేషన్ అం టూ ఓ శాఖ ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా జాయింట్ డైరెక్టర్,ఇద్దరు ముగ్గురు సిబ్బంది ఉన్నారు.ఆ శాఖ ఏం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. నిబంధనల ప్రకారం పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేసుకొనే స్లాటర్ హౌస్‌లోనే వధ జరగాలి. వధకు ముందు పశువైద్యులు పరిశీలించి ఆ జంతువుకు ఎలాంటి రోగాల్లేవని, తినడానికి అనుకూలమేనని ధ్రువపరచాలి. మాంసంపై కూడా స్టాంప్ వేస్తారు.ఎక్కడపడితే అక్కడే కోసేస్తున్నా అధికారులకు కనిపించడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చూస్తే ఇప్పటి వరకూ అధికారులు తనిఖీలు చేసిన ఘటనలే లేవంటే అతిశయోక్తి కాదు.

ఏది తింటే బెటర్..

ఇటీవల అమ్మకాలు పెరగడంతో గొర్రె తోకకు నల్లరంగు పూసి మేక మాంసమని అమ్ముతున్నారు. దీనిని జాగ్రత్తగా గమనించుకోవాలి. ఒకవేళ బాగా నిల్వ చేసి ఉంటే మాంసం కొట్టే సమయంలో జిగురులా వస్తుంది. మేక మాంసంలో కొవ్వు శాతం తక్కువగా..ప్రొటీన్ ఎక్కువగా ఉంటే గొర్రెలో కొవ్వు ఎక్కువగా ప్రొటీన్ తక్కువగా ఉంటుంది.ఐరన్ కూడా మేక లో అధికం. గుండె, కొలెస్ట్రాల్ ఇబ్బందులు ఇన్న వాళ్ల గొర్రె తినకపోవడమే మంచిది. జీర్ణ సమస్యలు ఉన్నవాళ్లకు గొర్రె బెటర్. తలకాయ, కాళ్లు, శాల్తీల విషయంలో ఎవరిష్టం వారిది. తలకాయలు, కాళ్లకూ ఈ మధ్య గిరాకీ పెరిగింది.దీంతో ఐస్‌లో ఎక్కువ రోజులు నిల్వ చేసినవి అమ్మేస్తున్నారు. గొర్రె తలకాయలను మేకవని విక్రయిస్తున్నారు.తేడా తెలుసుకోవడానికి చిన్న లాజిక్ ఉంది. గొర్రె తలకాయలోని కళ్ల కింద చిన్న సొట్టలు ఉంటాయి. మేకకు ఉండవు.



చికెన్ తినలేక..!

ఇటీవల బర్డ్ ఫ్లూ కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీంతో చికెన్ వినియోగం బాగా తగ్గింది. మార్కెట్‌లో మాంసం అవసరతలో 70 శాతం చికెన్ తీర్చేది. ఇప్పుడు చికెన్ వినియోగం తగ్గడం, చనిపోయిన కోళ్లను, కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారనే విషయం బయటకు రావడం వల్ల చేపలను తినడానికీ వెనుకాడుతున్నారు. ఈ ప్రభావం మటన్‌పై పడి విపరీతంగా వినియోగం పెరిగిపోయింది. దీంతో ధరలు పెంచేశారు. చికెన్ తినలేక.. మటన్ కొనలేక సామాన్యులు అల్లాడిపోతున్నారు.

అమరజీవి త్యాగ ఫలితమే..
భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు

- కలెక్టరేట్ పరిపాలనాధికారి విశ్వేశ్వరరావు



కలెక్టరేట్‌లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పరిపాలనాధికారి విశ్వేశ్వరరావు

అమలాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగ ఫలితమే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు అని కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం పొట్టిశ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని అమరజీవి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. శ్రీరాములు పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శ్రీరాములు ఆశయ సాధన కోసం అందరం పునరంకితం అవుదామన్నారు. కార్యక్రమంలో కృష్ణకాంత్, శేఖర్, ప్రదీప్, జి.రాజు పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు..
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

అమలాపురం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలనుంచి యథావిధిగా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అర్జీదారులుతమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌తోపాటు డివిజన్‌స్థాయిలో ఆర్డీవో కార్యాలయాలవద్ద, జిల్లాలోని అన్ని మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాల్లో జరిగే గ్రీవెన్స్‌ను కూడా అర్జీదారులు సద్వినియోగం చేసుకుని సమయాన్ని, సొమ్ములను ఆదా చేసుకోవాలని కోరారు. మండలస్థాయిలో తహశీల్దార్లు, ఎంపీడీవోలతోపాటు మిగిలిన అధికారులంతా గ్రీవెన్స్‌లో పాల్గొంటారని ఆయన స్పష్టం చేశారు.

భక్తుల పవిత్రతకు భంగం కలగకుండా..
అప్రమత్తంగా ఉండాలి

- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



దేవదాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి

మలికిపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దేవాలయాల వద్ద భక్తుల పవిత్రతకు భంగం కలగకుండా దేవదాయ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. దిండిలో పశ్చిమగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దేవదాయ శాఖాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాలయానికి చెందిన ఖాళీస్థలాలు ఉంటే వాణిజ్య పరంగా అభివృద్ధిచేసి వాటి ద్వారా ఆదాయాన్ని పెంచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అటువంటి స్థలాలు గుర్తించి రిసార్ట్స్, వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయాలవద్ద పారిశుధ్యంపట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. దేవాలయాల ఆవరణలోని ఖాళీస్థలాల్లో మొక్కలునాటి భక్తులు సేద తీరేలా ముందుకు వెళ్లాలన్నారు. ప్రతిరోజూ దేవాలయాలవద్ద ఉదయం భక్తిగీతాలను వినిపించడం ద్వారా ప్రశాంతత కల్పించాలన్నారు. అన్నప్రసాదాలు, ప్రసాదాల నాణ్యతలో కచ్చితంగా వ్యవహరించాలన్నారు.ఆలయాలవద్ద సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా నిఘా ఉంచాలన్నారు. వైదిక కమిటీల సూచనలు, సలహాలను పాటించాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జాయింట్ కమిషనరుసుబ్బారావు, అసిస్టెంట్ కమిషనర్లు సత్యనారాయణ, చక్రధరరావు, సూర్యప్రకాష్, ఈవోలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కార్మికుల భద్రత..
నా బాధ్యత

- కాకినాడలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో కార్మిక శాఖ మంత్రి సుభాష్ 7
- కార్మికుల భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ట్రావెల్ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి 7

- కొత్తపేటలో ఘటన

అత్తాకోడళ్ల ఘర్షణ 7

రామచంద్రపురంలో ఘటన



ధర పతనం

- దిగజారిన టమోటా ధర
- కిలో 6 రూపాయిలే 7
- కోయకుండా వదిలేస్తున్న రైతులు

భక్తులతో కిటకిటలాడిన సిద్ధి వినాయకుని ఆలయం



అయినవిల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సుదూరప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సోమవారంనుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు స్వామివారిని దర్శించుకుని హాల్ టిక్కెట్లను స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించారు.

వేసవి వచ్చేసింది.. ఏం చేద్దాం!




వేసవి వచ్చేసింది.. ఎండలు మండిపోతున్నాయి.. మరోపక్క చెరువులు ఎండిపోతున్నాయి.. అధికారులు ఈపాటికే చెరువులు నింపడం.. దాహార్తిని తీర్చడంపై సమీక్షలు జరిపాలి.. కానీ ఇప్పటికీ అటువంటి చర్యలే లేవు.. నీటి ఎద్దడి వచ్చినా మేం ఏదో ఒక చోటకు ఎగిరెళ్లి దాహం తీర్చుకుంటాం.. మీ గురించి ఆలోచిస్తుంటేనే బాధగా ఉంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టుగా.. కొంగలు.. గేదెలు కలిసి దివాన్‌చెరువులోని ఒక చెరువులో సమావేశమై వేసవిని ఎలా అధిగమించాలనేదానిపై చర్చిస్తున్నట్టు ఉంది కదూ ఈ చిత్రం..

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఎగిరిపోతే.. ఎంత బావుంటుంది!



కాకినాడ రూరల్ వలసపాకల శివారులో మేత తింటూ.. గాల్లోకి ఎగురుతూ.. సందడి చేస్తున్న కొంగలు



ఎగిరిపోతే ఎంత బావుంటుంది.. అన్నట్టుగా అప్పటివరకు ఎండు చేపలు ఆహారంగా తీసుకుని.. ఆకలి తీర్చుకుని హాయిగా గగనంలోకి ఎగిరిపోతున్న కొంగలు

- ఫొటోగ్రాఫర్, కాకినాడ

భళా.. బాలిక!

ఆరేళ్లప్రాయంలోనే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



సాధన చేస్తున్న చిన్నారి నిత్యశ్రీ

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లప్రాయంలోనే ఆ చిన్నారి విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆర్చరీ పోటీల్లో చూపించిన ప్రతిభ ఆధారంగా అండర్ 10 పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి నిత్యశ్రీ వయస్సు ఆరేళ్లు. చిన్ననాటి నుంచి ఆర్చరీపై ఆసక్తి ఉండటంతో కోచ్ పి.లక్ష్మణరావు ఆమెకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఇటీవల నిత్యశ్రీ పలు జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా అండర్ 10 కేటగిరిలో అత్యధిక స్కోరు సాధించింది. ఈ చిన్నారి ప్రతిభను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఏపీ జట్టుకు ఎంపిక చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ సమాచారం ఇచ్చారు. గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే ఆరవ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలు అండర్ 10 ఇండియన్ రౌండ్ కేటగిరి బాలికల విభాగంలో నిత్యశ్రీ ఏపీకి ప్రాతినిధ్యం వహించనున్నది. ఈమె ప్రస్తుతం కోచ్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతోంది. నిత్యశ్రీ ఆదిత్య స్కూలులో యూకేజీ చదువుతోంది. చిన్నారిని స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాసకుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం తదితరులు అభినందించారు.

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్‌కు మాతృ వియోగం



అనంత లక్ష్మి(ఫైల్)

మండపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రుశ్రీవరప్రకాష్ తల్లి చుండ్రు అనంతలక్ష్మి(70) (అమ్ములు) ఆదివారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. గతకొంత కాలం నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆమె ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆదివారం తెల్లవారుజామున మరోసారి గుండెపోటు రావడంతో వైద్యులను పరిశీలించి మృతిచెందారని ధ్రువీకరించారు. అనంతలక్ష్మికి భర్త చుండ్రు గోవిందరాజులు, కూమార్తె లావణ్య, కూమారుడు చుండ్రుశ్రీవరప్రకాష్ ఉన్నారు. ప్రకాష్ అభి మానులు, అనుచరులు ఆయన నివాసానికి చేరుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతలక్ష్మి అంత్యక్రియలను ఆదివారం కటుంబ సభ్యులు, అభిమానుల నడుమ మండపేటలోని రుద్రభూమిలో నిర్వహించారు.

కార్మికుల భద్రత నా బాధ్యత

● మంత్రి వాసంశెట్టి సుభాష్ ● కాకినాడలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలు



రైసుమిల్లుల్లో భద్రతా చర్యలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రత తన బాధ్యత అని, వారు భద్రంగా, ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుందని, వారి భద్రతతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారమవుతుందని కార్మిక ఫ్యాక్టరీస్, బాయిలర్స్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్ శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం వాకలపూడి, పెద్దాపురం ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని కాకినాడలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిపిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కోరమండల్, ఓఎన్‌జీసీ, రిలయన్స్, జెమిని ఎడిబుల్ ఆయిల్స్, రైస్ మిల్స్ అసోసియేషన్ ఇతర వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎంటీ హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రైసు మిల్లుల్లో భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నా కార్మిక కుటుంబ సభ్యులందరినీ నేరుగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం పట్ల యాజమాన్యాలు మరింత బాధ్యత తీసుకోవాలన్నారు. భద్రత నియమాలను సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా స్థానిక భాషల్లో రూపొందించాలని మంత్రి సూచించారు. రసాయన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు రసాయనాల పట్ల, వాటి వల్ల కలిగే ప్రమాదాల పట్ల శిక్షణ తరగతులు నిర్వహించాలని, ప్రమాదాలను పసిగట్టి నివారించే టెక్నాలజీని వాడుకోవాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబు వసుధా మిశ్రా నేతృత్వంలో కమిటీ వేశారని, ఆ కమిటీ రిపోర్టు ఆధారంగా అన్ని భద్రతా చర్యలను తూ.చతప్పకుండా పాటించాలన్నారు. యాజమాన్యాలు, కార్మికులు ప్రభు త్వ యంత్రాంగం కలిసి జీరో యాక్సిడెంట్ అనే నినాదంతో ముందుకెళ్లాలని మంత్రి కోరారు. కార్మికలోకపు కల్యాణానికి, శ్రామికలోకపు సౌభాగ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాకినాడలో బధిర విద్యార్థులను దత్తత తీసుకోవడంతో పాటు భవన మరమ్మతులు, అదనపు గదినిర్మాణానికి ముందుకు వచ్చిన జెమినీ ఎడిబుల్స్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, కాకినాడ జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేశ్, జిల్లా ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ డి.రాధాకృష్ణ, ఇన్‌స్పెక్టర మురళీకృష్ణ, జిల్లా కార్మికశాఖ అదనపు కమిషనర్ బుల్లిరాణి, పరిశ్రమలశాఖ జీఎం సీహెచ్ గణపతి, జిల్లా బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

అల్లూరి జిల్లా గంగవరం వద్ద ఘటన




మృతులు కొర్రపు శ్రీనివాస్, గొర్లె శేఖర్



గాయాలపాలైన శేఖర్ భార్య, కొడుకు

వై.రామవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా గంగవరం మండలం గంగవరం గ్రామ శివారులో 216 జాతీయ రహదారి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంగవరం- అడ్డతీగల ప్రధాన రహదారిలో గల గంగవరం గ్రామ శివారులో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గొర్లె శేఖర్(30), వై.రామవరం మండలం బూరుగుపాలెంకు చెందిన కొర్రపు శ్రీనివాస్(25) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు శేఖర్ భార్య హబీబీ, కుమారుడికి తీవ్రగాయాలు కావడంతో రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు గంగవరం ఎస్ఐ బి.వెంకటేష్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

కొత్తపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేట సమితి రోడ్డుకు చెందిన కోనాల రాఘవులు(72)ను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం.. రాఘవులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు కోనాల సత్యనారాయణ లారీ క్లీనర్‌గా పనిచేస్తూ బయట ప్రాంతంలో ఉంటున్నాడు. చూసేవారు లేక స్థానిక బోడిపాలెం వంతెన వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద నివసిస్తున్నాడు. శనివారం రాత్రి అమలాపురం నుంచి వచ్చే ప్రవేట్ ట్రావెల్ బస్సు రాఘవులను ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. కుమార్తె ఉండవల్లి వెంకటరమణ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాఆసుపత్రికి తరలించిన్నట్టు చెప్పారు.



మృతి చెందిన కోనాల రాఘవులు

జేఎన్టీయూకేలో ముగిసిన టెక్ ఫెస్ట్




ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్‌తో నమూనాలు ప్రదర్శించిన బృందం



విద్యార్థినులు ఏర్పాటు చేసిన చేసిన ఎలక్ట్రికల్ వాహనాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో 2రోజులు జరిగిన జాతీయ స్థాయి సింపోజియం టెక్ ఫెస్ట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు, పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్‌ను సందర్శించి అభినందించారు. అనంతరం యూసీఈకే ప్రిన్సిపాల్ కార్యాలయ సెమినార్ హాల్లో రోబోటిక్ అప్లికేషన్ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డును అభివృద్ధి చేయడం అంశంపై నిర్వహించిన శిక్షణను పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు, ప్రతిభాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, వైస్ ప్రిన్సిపాల్స్ వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులున్నారు.

టమోటా..ధర లేదట!



కిలో రూ.6, కోత ధర కూడా రావడంలేదని రైతుల గగ్గోలు

ఆలమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులకు పుట్టెడు కష్టాలు వచ్చిపడ్డాయి. ధర లేక దయనీయస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. కోనసీమ జిల్లాలోని లంక పరివాహక ప్రాంతాల్లో టమోటా సాగు జోరుగా సాగుతుంది. ఈ పంట పూర్తిగా కాపు కొచ్చి అందుబాటులోకి వచ్చేసరికి ధర పూర్తిగా పడిపోయి కనీసం కోత కూలీ కూడా రాని దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది పంటకు అనుకూలంగా ఉండి దిగుబడులు గణనీయంగా రావడంతో ఒక్కసారిగా ధర పడిపోయి రైతులు అయోమయంలో పడ్డారు. అంతర్‌రాష్ట్ర మడికి కూరగాయల మార్కెట్లో 10 కిలోల టమోటో ధర రూ.60నుంచి 70 పలికింది. అంటే కిలో ధర రూ.6లు. ఈ ధరతో టమోటా కోసి మార్కెట్‌కు తరలించాలంటే కనీసం కిలోకి రూ.10 ఖర్చవుతుందని, దీంతో కోయడమే మానేయడం మంచిదని రైతులు వదిలేస్తున్నట్టు చెబుతున్నారు.

సాగు చేసి భారీగా నష్టపోయా



టమోటా సాగు ఆశాజనకంగా ఉంటుందని భారీగా పెటుబడి పెట్టి పంట సాగు చేశా. దిగుబడులు బాగా ఉన్నప్పటికీ కోత కూలీ రాక పంటభూమిలోనే కోయకుండా వదిలేయడం జరుగుతుంది. టమోటా సాగులో ఇంత దయనీయస్థితి మునుపెన్నడు చూడలేదు.

బి.సాయిబాబు, టమోటా రైతు, జొన్నాడ

శతాధిక వృద్ధురాలు సూర్యకాంతం మృతి



సూర్యకాంతం (ఫైల్)

అమలాపురం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన శతాధిక వృద్ధురాలు గొవ్వాల సూర్యకాంతం (110) అనారోగ్యంతో మృతిచెందారు. మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్‌కు ఆమె స్వయాన నానమ్మ. సూర్యకాంతంకు ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వారితో పాటు మనుమలు, ముని మనుములు 52మంది ఉన్నారు. ఆదివారం సూర్యకాంతం చిత్రపటానికి పలువురు రాజకీయ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

22 నుంచి గౌరీపట్నంలో నిర్మలగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు



మహోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

దేవరపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని నిర్మలగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో జయరావు మట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రణవిల్లుతుందన్నారు. పుణ్యక్షేత్రం ప్రారంభించి 40 ఏళ్ల అయ్యిందని, 2000 సంవత్సరంలో నిర్మలగిరి క్షేత్రంలో ప్రధాన దేవాలయం నిర్మించి 25 ఏళ్ల అయిన సందర్భంగా ఈ ఏడాది సిల్వర్ జూబ్లీ నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, చిన్నారులు, వృద్ధులకు పాలు, మజ్జిగ అందజేస్తామన్నారు. పుణ్యక్షేత్రంలో నితాన్నదానం జరుగుతుందన్నారు. భక్తులకు శాంతి కలగడానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామని, పుణ్యక్షేత్రం సందర్శించిన భక్తులందరికీ ధైర్యం, మనశ్శాంతి కలుగుతాయన్నారు. ఉత్సవాల నిర్వహణకు 250మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని, పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహిస్తారని, ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పుణ్యక్షేత్ర సందర్శనకు ఉభయ రాష్ట్రాల నుంచి పదిలక్షల వరకు భక్తులు వస్తారని తెలిపారు. జయరావును జాన్‌పీటర్, నితాన్నదాన కాంట్రాక్టర్ కళ్ళేపల్లి నాగేశ్వరరావు సత్కరించారు. రెవరెండ్ ఫాదర్లు పీ.బాల, డీ.ఆరోన్, తదితరులు ఉన్నారు.

కాపవరంలో ఎడ్ల పరుగు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ తుమ్మల బాబు

సామర్లకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కాపవరంలో ఆదివారం గ్రామ టీడీపీ నాయకులు కుంచం శ్రీను, చోడిశెట్టి దొరబాబు, సతీష్, కుంచం బాబ్జీ ఆధ్వర్యంలో రామలింగేశ్వరా రాష్ట్ర స్థాయి సీనియర్, జూనియర్ ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి సు మారు 25జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజేతలకు సీనియర్ విభాగంలో కుడా చైర్మన్ తుమ్మల రామ స్వామి(బాబు), జూనియర్ విభాగంలో విజేతలకు ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్ బహుమతులందజేశారు.

విజేతలు వీరే..

కోనసీమ అంబేడ్కర్ జిల్లా గుమ్మిలేరు కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లు ప్రథమ బహుమతికి ఎంపిక కావడంతో రూ.12 వేలు నగదు, షీల్డ్.. కాకినాడ జిల్లా ధర్మవరం జువ్వల సత్తిబాబుకు చెందిన ఎడ్లుకు ద్వితీయ బహుమతిగా రూ.10 వేల నగదు, షీల్డ్.. తృతీయ బహుమతిగా కోనసీమ జిల్లా గుమ్మిలేరు కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లకు రూ.8వేల నగదు, షీల్డ్ బహుమతులను అందజేశారు. జూనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా సామర్లకోట పాలచర్ల కళ్యాణ్ కుమార్‌కు చెందిన ఎడ్లు ప్రథమ బహుమతిగా రూ.10 వేల నగదు, షీల్డ్.. ద్వితీయ బహుమతిగా కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కాపవరం కుంచం మనోజ్‌కు చెందిన ఎడ్లకు రూ.8 వేల నగదు, షీల్డ్.. తృతీయ బహుమతిగా కాకినాడ జిల్లా కోవ్వాడ మట్టా నవనీత్ శ్రీమణి కంఠకు చెందిన ఎడ్లకు రూ.6 వేల నగదు, షీల్డ్ బహుమతులను అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా యన మల కృష్ణ, చేకూరి రామకృష్ణ, కంటే ఫణి కుమార్ వ్యవహరించారు.

మాటామాటా పెరిగి.. ఇటుక ముక్కలతో కొట్టుకుని!

అత్తాకోడళ్లు ఘర్షణ

గాయాలతో ఆసుపత్రిలో చేరిక

ద్రాక్షారామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం కందులపాలెంలో శనివారం అత్తాకోడళ్ల మధ్య వాగ్వాదంతో పరస్పరం దాడి చేసుకోవడంతో ఇద్దరు గాయపడ్డారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో శనివారం రాత్రి ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్డు ఉమామహేశ్వరి తన భర్తను వదిలివేసి వేరే వివాహం చేసుకుని కాకినాడలో నివాసం ఉంటుంది. ఆమె అత్త బొడ్డు సత్యవతి కందులపాలెంలో నివసిస్తుంది. ఉమామహేశ్వరి శనివారం తన అత్త సత్యవతి ఇంటికి వచ్చి బంగారు నగలపై అత్తను ప్రశ్నించింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఇటుక ముక్కలతో దాడి చేసుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరారు. ద్రాక్షారామ అదనపు ఎస్ఐ భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.4.39 లక్షల ఆదాయం

తుని రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కాకినాడ జిల్లా తుని మండలంలో గల తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్‌లు కిక్కిరిశాయి. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.4.39 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భారీ బండి..బాగుందండి!



పరిశ్రమల్లో వినియోగించే బాయిలర్‌ను మోసుకెళ్తూ తుని జాతీయ రహదారిపై ఓ భారీ ట్రాలీ వాహనం ఇలా కనిపించింది. -తుని రూరల్

ఎమ్మెల్సీ పరామర్శ

అమలాపురం రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రమేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం పరామర్శించారు. పేరూరు ఇందిరా కాలనీలో ఆకుమర్తి పార్వతి చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలకు 79మంది హాజరు

అమలాపురం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలకు 79 మంది హాజరయ్యారు. భట్లపాలెం సెంటర్‌కు 170మంది అభ్యర్థులను కేటాయించగా 91మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

మౌలిక సదుపాయాల కల్పనలో యాజమాన్యం వైఫల్యం

నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు


అమలాపురం ఆర్టీసీ డిపోలో నిరసన తెలుపుతున్న యూనియన్ల నాయకులు, కార్మికులు

అమలాపురం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో యాజమాన్యం ఘోరంగా వైఫల్యం చెందిందని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కె.నాగరాజు ఆరోపించారు. వాటర్ ప్లాంటును మరమ్మతులు చేయించి వేసవిలో కార్మికులు, ప్రయాణికులకు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో 27వ రోజు ఆదివారం డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని గేట్ మీటింగ్ నిర్వహించారు. వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.గణపతిరావు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలను సైతం యాజమాన్యం పట్టించుకోవడంలేదని విమర్శించారు. డిపోలో 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయడంతో పాటు అక్రమంగా సస్పెన్షన్‌కు గురైన బీఎస్ నారాయణను విధుల్లోకి తీసుకోవాలని, డ్రైవర్ కేజీ రావుపై వేధింపులు మానుకోవాలని నినాదాలు చేశారు. వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి కె.రంగప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తుందని వివరించారు. కార్మికులు 21 రోజులుగా దీక్షలు చేస్తున్నా యాజమాన్యంలో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో అధ్యక్షుడు ఆర్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. డిపో ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలో ఎల్ఎస్ బాబు, పీవీ రత్నం, వీఎల్ఎన్ రావు, ఎంఆర్ కృష్ణ, పీవీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. పలువురు సంఘీభావం తెలిపారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

నివాళులర్పించిన పలువురు


అమలాపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురంటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రించుకుని అమలాపురం సర్క్యులర్ బజార్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం పలువురు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీరాములు జయంతి వేడుకల్లో కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, కోశాధికారి పడాల నాయుడు, డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, నూకల సత్యనారాయణ, పట్నాల రమణ, కుడుపూడి త్రినాథ్, చింతలపూడి సత్తిబాబు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వై.అనంతలక్ష్మి, కంకటాల లక్ష్మి, పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు నాళం సత్యశ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ముక్తిధామ్ ట్రస్టు ప్రతినిధులు బళ్ల స్వామివివేకానంద, ఉప్పుగంటి భాస్కరరావు, కొండా బ్రహ్మానందం, బాసిన శివన్నారాయణ, సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముక్కామల, చిరతపూడి, పెదపూడి, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): భీమనపల్లిలో ఆదివారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వరదా శ్రీరామచంద్రమూర్తి, మునికోటి సూరిబాబు, కంకటాల సత్యనారాయణ, మునికోటి శ్రీను, సురేష్, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు మండలంలో నిర్వహించారు. మానేపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు నివాళులర్పించారు. పెంటపాటి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, నూలు మురళీకృష్ణ, నూలు సత్యనారాయణ, గుగ్గిళ్ళ మధు, శ్రీకాకుళపు బాపిరాజు, గెల్లి వెంకటరత్నం, శిరం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు ఆధునికీకరణ


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న రోడ్లను ప్రాధాన్యతా క్రమంలో ఆధునికీకరింపచేసి ప్రజలకు మెరుగైన రోడ్డు, రవాణా మార్గాలను కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. స్థానిక 3వ వార్డులోని చింతలమెరక, 19వ వార్డు మట్టాడిపాలెం రోడ్ల ఆధునికీకరణకు అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్‌మాధుర్ మంజూరుచేసిన రూ.50లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రతీ ఇంటికీ మంచి నీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.రవివర్మ, ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, కట్టా సత్తిబాబు, మాదాల బుజ్జి, దివి విజయ్, పిల్లి నాగరాజు, గొల్లపల్లి గోపి, దాట్ల బాబు, పెన్మెత్స జగ్గప్పరాజు, నడింపల్లి శ్రీనివాసరాజు, రెడ్డి సుధీర్, రెడ్డి శివన్నారాయణ, కాశి లాజర్, సరిపెల్ల శ్రీనివాసరాజు, గోరింట్ల శ్రీనురాజు, సత్తి నూకరాజు, పి.నరసింహమూర్తి, రెడ్డి సుధీర్, అసిస్టెంట్ ఇంజనీర్‌లు పీవీ సుధాకర్, కె.శ్రీనివాస్, ఎ.సత్యనారాయణరాజు, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

రాజోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ఏప్రిల్ 1వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో ఎం. మనోహరం ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి 524మంది, ప్రైవేటు పాఠశాల నుంచి 336మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 76 మంది విద్యార్థులు కలిపి మొత్తం 936మంది విద్యార్థులు హాజరవుతరన్నారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం

రాజోలు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని రాజోలు డిపో మేనేజర్ ధనమ్మ ఆదివారం తెలిపారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్‌టిక్కెట్ ఆధారంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు. ఈనెల31వరకు పదో తరగతి పరీక్షలు ఉన్న రోజుల్లో ఉచిత ప్రయాణంచేయవచ్చన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల వ్యాపార ధోరణి మారాలి

మలికిపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల్లో వ్యాపార ధోరణి విడనాడాలని జిల్లా వినియోగదారుల సంక్షేమ సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్ కోరారు. కొంతమంది వైద్యులు రోగుల బలహీనతలను ఆసరాగా చేసుకుని అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు గాలికి వదిలి వివిధ పరీక్షలకు ఆపరేషన్లకు సంబంధించి ధరల పట్టికను ఏర్పాటు చేయడంలేదని, ఆసుపత్రుల్లో ఉన్న సౌకర్యాల గూరించి రోగులకు తెలియచేయడం లేదని విమర్శించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి నియమ నిబంధనలు పాటించని ఆసుపత్రుల పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావుదొరకు వినతిపత్రం అందించినట్టు చెప్పారు.

ఓఎన్జీసీపై 14వ రోజు నిరసన పోరు

అల్లవరం మార్చి 16(ఆంధ్రజ్యోతి): అపారమైన చమురు నిక్షేపాల్లో భారతదేశంలోనే అగ్రగామిగా ఉన్న ఓడలరేవు గ్రామాభివృద్ధి పట్ల ఓఎన్జీసీ అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గ్రామస్తులు 14వ రోజున ఆదివారం రిలే దీక్ష కొనసాగించారు. ఓఎన్జీసీ స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. 14రోజులుగా దీక్షలు చేస్తున్నా ఓఎన్జీసీ అధికారులు స్పందించకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓడలరేవు గ్రామ దత్తత, గ్రామ యువతకు ఓఎన్జీసీ టెర్మినల్‌లో ఉపాధి కల్పించాలని, ఓడలరేవు గ్రామాన్ని సముద్ర కోత బారి నుంచి రక్షించాలని, ఓడలరేవును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న పలు డిమాండ్లతో గ్రామస్తులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, పెమ్మాని వెంకటరామారావు, మందపాటి రామకృష్ణ, గండుమేను శ్రీనివాస్, తోటే వెంకటేశ్వరరావు, రేకాడి శేషగిరి దీక్షల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పచ్చిమాల ఏడుకొండలు, జనసే నాయకులు కంకిపాటి వీరబాబు, పిండి గణపయ్య, నల్లా రాము తదితరులు ఓడలరేవు గ్రామస్తుల దీక్షలకు సంఘీభావంతెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దేవ

రాజోలు, మార్చి16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శివకోటి గ్రామంలో శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే దేవ ఆవిష్కరించారు. అనంతరం స్థానిక సర్పంచ్ నక్కా రామారావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి, ఎంపీపీ కేతా శ్రీను, వైఎస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, సర్పంచ్ రేవు జ్యోతి, తెన్నేటి కిషోర్, బత్తుల మురళీకృష్ణ, చాగం టి స్వామి, సీపీఎం నాయకులు పీతల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆధునికీకరణ పనులు వేగవంతం


శ్మశానవాటికలో ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న అముడా చైర్మన్ స్వామినాయుడు తదితరులు

అమలాపురంటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): అమలాపురం నల్లవంతెన దిగువన 29వ వార్డులో ఉన్న హిందూ శ్మశానవాటికలో చేపట్టిన ఆధునికీకరణ పనులను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం కూటమి నాయకులు పరిశీలించారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా శ్మశానవాటికను అత్యంత సుందరవనంగా తీర్చిదిద్దామన్నారు. కొవిడ్ రాకతో శ్మశానవాటిక నిర్వహణ లేకపోవడంతో అప్పటి నుంచి శిథిలావస్థకు చేరిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు శ్మశానవాటికను సందర్శించి సమస్యలను ఎమ్మెల్యే ఆనందరావుకు వివరించారు. తక్షణం స్పందించిన ఆయన ఆధునికీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో శ్మశానవాటిక అందుబాటులోకి తీసుకువస్తామని స్వామినాయుడు తెలిపారు. టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, కౌన్సిలర్లు యేడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, పడాల నానాజీ, వలవల శివరావు పాల్గొన్నారు.

యానాం వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

యానాం,మార్చి 16(ఆంధ్రజ్యోతి): యానాం జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన ప్రతినిధులు యానాం వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. నవోదయలో పేస్ సెట్టింగ్ యాక్టివిటీలో భాగంగా ఈకార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వృద్ధాశ్రమానికి వచ్చిన వారు వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు సమక్షంలో వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. అనంతరం వారు యానాం వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడ ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

21తో ముగియనున్న పుదుచ్చేరి షాపింగ్ ఫెస్టివల్

యానాం,మార్చి 16(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు నెలలుగా నిర్వహిస్తోన్న పుదుచ్చేరి షాపింగ్ ఫెస్టివల్ ఈనెల21తో ముగుస్తుందని పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. ఇప్పటికే ఆయా షాపుల యాజమానులకు కూపన్లు జారీ చేశామన్నారు. ఈకూపన్లకు సంబంధించి ఈనెల24న పుదుచ్చేరిలో రీజియన్ల వారీగా డ్రా తీస్తారన్నారు. యానానికి సంబంధించి భారీ బహుమతులు కూడా ఉన్నాయన్నారు. వస్తువుల కొనుగోలుకు సంబంధించి ఆయా వ్యాపార సంస్థల నుంచి ప్రజలు కూపన్లు తీసువాలన్నారు.

రూ.10లక్షల చెక్కు అందజేత

ఐ.పోలవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ పంచాయతీ పితానివారిపాలేనికి చెందిన పితాని మల్లిబాబు కొంతకాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. అతని కాలేయ మార్పిడికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10లక్షల చెక్కును మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద మల్లిబాబుకు ఆదివారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అందించారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, దాట్ల పృధ్వీరాజు, ఏలూరి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం అభినందనీయం : ఎమ్మెల్యే


హైస్కూలు ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ

మామిడికుదురు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థుల కుటుంబం అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కొనియాడారు. మామిడికుదురు జిల్లాపరిషత్ హైస్కూలు ప్రాంగణంలో పూర్వ విద్యార్థి భూపతి నాగేశ్వరరావు స్మారకార్థం అతని కుటుంబ సభ్యులు నిర్మిస్తున్న మల్టీ పర్పస్‌భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపన చేశారు. పూర్వ విద్యార్థి కుటుంబ సభ్యులు రూ.30లక్షలతో ఈభవనాన్ని హైస్కూలు ప్రాంగణంలో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మామిడికుదురులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని, దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడతానని చెప్పారు. పూర్వ విద్యార్థుల సహకారంతో హైస్కూల్‌ను చక్కగా తీర్చిదిద్దుతున్న ప్రధానోపాధ్యాయున్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, వర్ధినేని రాము, పార్టీ నాయకులు ఈలి శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, యింటి మహేంద్ర, సాపే ఏకాదశి, రుద్ర శ్రీను, కాట్రేనిపాడు నాగేంద్ర, గుండాబత్తుల తాతాజీ, ఎంఈవోలు వెంకన్నబాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మామిడికుదురు, మార్చి16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ పెదమల్లు మన్విత మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కంచర్ల బాబీ అన్నారు. వైద్యశాస్త్రంలో ఎంఎస్ జనరల్ సర్జన్ చేసిన మన్వితకు స్వగ్రామం పాసర్లపూడిలంకలో ఆదివారం పెదమల్లు వంశీయులు సన్మానించారు. కార్యక్రమంలో కంచర్ల కృష్ణ, పెదమల్లు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడిగా శ్రీనివాస్


యాదవ సంఘ జిల్లాశాఖ నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురంటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం అమలాపురంలో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన కోరశిక వీరవెంకటసుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లాశాఖ నూతన అధ్యక్షుడిగా బర్ల శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా మందపాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గుండుమేను ప్రసన్నమణికంఠస్వామి, సంయుక్త కార్యదర్శిగా సూరిబోయిన సుబ్రహ్మణ్యం, కోశాధికారి పాశం చింతారావు, యువజన సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడిగా మందపాటి బాలుయాదవ్, మహిళా అధ్యక్షురాలిగా చేకూరి లక్ష్మితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జనాభా ప్రాతిపదికన యాదవులకు రాజకీయం రంగంలో సముచిత స్థానంకల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. నూతనకార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

మల్లాడి పరామర్శ

యానాం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పలు బాధిత కుటుంబాలను ఆదివారం మల్లాడి పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. కనకాలపేటలోని కనకాల వెంకట్రావు తల్లి ఇటీవల మృతిచెందడంతో ఆమె కుటుంబ సభ్యులను, కోనా వెంకట్రావు సతీమణి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మల్లాడి పరామర్శించి సానుభూతి తెలిపారు. ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ముమ్మిడివరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని చింతావనిరేవుకు చెంది రేకాడి ధనకుమారి విద్యుదాఘాతానికి గురై మృతిచెందగా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. భర్త రేకాడి కనకరాజు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. ఎమ్మెల్యే ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, గుత్తుల సాయి, కుంచే ప్రతాప్, మట్టా రాహుల్, మోర్త అప్పారావు, పెన్నాల నాగమునేంద్రరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

కాట్రేనికోన, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ఒకటో వార్డులో రోడ్డు నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈరోడ్డు కోసం 1989లో అప్పటి ఎమ్మెల్యే బత్తిన సుబ్బారావు కాలం నుంచి ఇప్పటి వరకు మార్కెట్ వాసులు రోడ్డు కోసం పోరాడుతూనే ఉన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఈ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను వివరిస్తూ అనేక సార్లు వార్తా కథనాలు వెలువరించింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఈసమస్యపై స్పందించారు. రూ.1.10కోట్లతో సుబ్బారాయుడు గుడి నుంచి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వరకు ఇరువైపులా రూ.50లక్షలతో డ్రైనేజీతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. మార్కెట్ ప్రాంతంలో ఖాళీ ప్రదేశాన్ని రూ.50లక్షలతో మెరక చేయనున్నారు. ఈప్రాంతంలో రూ.10లక్షలతో మరో రోడ్డును నిర్మించనున్నారు.

షిరిడీసాయి ఆలయ వార్షికోత్సవ పూజలు



ఉప్పలగుప్తం, మార్చి16(ఆంధ్రజ్యోతి): భీమనపల్లిలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ నిర్మించిన శ్రీషిరిడీసాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రథమ వార్షికోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం వెంకటలక్ష్మీనారాయణ, నాగరత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో భారీఅన్నసమారాధన జరిగింది.

లోవోల్టేజీ సమస్య ఉండకూడదు: ఎమ్మెల్యే

కాట్రేనికోన, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలంలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య ఉండకూడదని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఏర్పాటుచేసిన 8ఎంవీఏలను ఆదివారం ఆయన ప్రారంభించారు. పల్లంకుర్రులో త్వరలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, సలాది స్వామినాయుడు, కముజు రాంబాబు, రంబాల చిట్టిబాబు, వాసంశెట్టి రాజేశ్వరరావు, సుంకర బుజ్జి, గ్రంధి నానాజీ, మట్ట రమేష్, కాండ్రేగుల సత్యప్రసాద్, చీకురుమెల్లి చక్రధర్, ట్రాన్స్ కో డీఈ రాంబాబు, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్‌మాన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆధునికీకరించాలి


అయినాపురంలో సమావేశమైన గ్రామస్తులు

ముమ్మిడివరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునికీకరణకు పార్టీలకు అతీతంగా పోరాటం సాగించాలని అయినాపురంలో ఆదివారం జరిగిన సమావేశం తీర్మానించింది. అయినాపురం జడ్పీ హైస్కూలు ఆవరణలో సోమిదేవరపాలెం, సూరాయిచెరువు, అయినాపురం గ్రామాలకు చెందిన కొంతమంది సమావేశమయ్యారు. అయినాపురం-కాట్రేనికోన రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందని, 2019లో అప్పటి ప్రభుత్వం రూ.23కోట్లు రోడ్డు ఆధునికీకరణకు మంజూరు చేసినా నేటికీ పనులు ప్రారంభం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం త్వరితగతిన చేపట్టేందుకు అవసరమైతే పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. అయితే సమావేశానికి హాజరైన కొందరు 21వరకు అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున సమావేశాల అనంతరం పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వారు నిర్ణయించుకున్నారు. మోకా రామారావు, బొంతు నాగరాజు, అయ్యల రమేష్, సానబోయిన చంటి, రెడ్డి నాని, మట్ట వెంకటేష్, ఇసుకపట్ల శివ, సలాది త్రినాథరావు, గోనెమడతల రవికుమార్, ఉంగరాల కుమార్ పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం

కాట్రేనికోన, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన తాత్కాలిక ఎంపీపీగా యేడిది అరుణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఎంపీడీవో వెంకటాచలం ఆమెతో తొలి సంతకం చేయించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ పాలెపు లక్ష్మి ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎంపీపీలను ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, యేడిది సుబ్బారావు, సర్పంచ్‌లు గంటి వెంకటసుధాకర్, చల్లగల వెంకటలక్ష్మి, దంతులూరి కృష్ణంరాజు, చెల్లి సురేష్, తహసీల్దార్ సురేష్‌కుమార్, నాయకులు యేడిది చక్రపాణిరావు, నడింపల్లి సూర్యనారాయణరాజు(సూరిబాబు), నల్లా నరసింహమూర్తి, కాశి హనుమంతరావు, సంసాని నాగేశ్వరరావు, కాశి హనుమంతరావు, బొక్కా రమణ, జగడం బాలయోగి, ఎంపీటీసీలు మోకా చంద్రనాగరత్నం, గుత్తుల మహాలక్ష్మి, గెద్దాడ గుణవేణుకుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రుడి సంబరం


వీరభద్రస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

మామిడికుదురు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామంలో బొలిశెట్టివారిపాలెంలో వీరభద్రస్వామి సంబరాన్ని భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని ఉదయం ఊరేగింపుగా మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య వైనతేయ నది వరకు ఊరేగింపు తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మిచెట్టుకు పూజలు జరిపారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి వీరభద్రస్వామి భక్తులు నిప్పుల గుండాన్ని తొక్కారు. వీరభద్రస్వామి సంబరాన్ని నాలుగు తరాలుగా బొలిశెట్టి వీరన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రక్తదానం

అమలాపురం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీస్వామివివేకానంద యోగాశ్రమాల ఆధ్వర్యంలో ఆదివారం ఆశ్రమ విద్యార్థులు 23మంది రక్తదానం చేసినట్టు యోగాగురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ, రాజమహేంద్రవరం, పి.గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న గర్భిణులతో పాటు రక్తహీనతతో బాధపడే రోగుల కోసం స్థానిక బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. పి.రవీంద్ర, ఎం.సాత్విక్, కె.దుర్గ, ఎం.ప్రవీణ్, కె.పవన్, బి.దుర్గేష్, ఎస్.కార్తీక్, ఎ.మధుసూదన్‌రావు, ఎల్.నాగు, పి.కల్కి తదితరులు రక్తదానం చేశారు.

శ్రీపెద్దింట్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


శ్రీపెద్దింట్లమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అంతర్వేది, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మెండుపాలెం చినకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా మొక్కులు చెల్లించుకుని అమ్మవారి ఆలయ ప్రదేశం, కొబ్బరితోటల్లో విందు భోజనాలు చేశారు. దర్శనం లైన్, మొక్కులు చెల్లించే క్యూలైన్లు భక్తులతో రద్దీగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనం వరకు భక్తులు బారులు తీరారు. పోలీసులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

ఉచిత వైద్యశిబిరం

ఉప్పలగుప్తం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్.కొత్తపల్లిలో ఆదివారం అమలాపురం రవి ఈఎన్టీ, ఎండోస్కోపిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత ఈఎన్టీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈఎన్టీ వైద్య నిపుణుడు కాశిన రవికుమార్ రోగులను పరీక్షించారు. 120మందికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచే చిట్టికుమారిచిన్ని, అంగాని సాంబశివరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం'

ఉప్పలగుప్తం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని మాల సంఘాల జేఏసీ అత్యవసర సమావేశం తీర్మానించింది. చల్లపల్లిలో ఆదివారం 22మండలాల జేఏసీ ముఖ్య నాయకులు జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు స్వగృహంలో కన్వీనర్ జంగా బాబూరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. తనకు మాలలు ఓట్లు వేయలేదన్న కక్షతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు ఆత్రుత పడుతున్నారని వక్తలు ఆరోపించారు. పూర్తి కులగణన చేయకుండా వర్గీకరణ చేపడితే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని సమావేశం హెచ్చరించింది. సమావేశంలో ఇసుకపట్ల రఘుబాబు, గొల్లపల్లి డేవిడ్‌రాజు, రేవు తిరుపతిరావు, నెల్లి లక్ష్మీపతి, గెడ్డం సురేష్‌బాబు, బూసి బుజ్జిదొర, పొలమూరి మోహన్‌బాబు, కుసుమ వెంకన్న, సాధనాల వెంకట్రావు, ముత్తాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోరిపోడు మాజీ సర్పంచ్ సత్యవతి మృతి



అంతర్వేది, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మోరిపోడు గ్రామ మాజీ సర్పంచ్ యెనుముల వెంకటనాగసత్యవతి(84) శనివారం మృతిచెందారు. 1996 నుంచి 2001 వరకు మోరిపోడు సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆమె భర్త యెనుముల లక్ష్మణరావు ఉపసర్పంచ్‌గా సేవలు అందించారు. ఆమె మృతిపట్ల స్థానిక గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.




వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో అన్నదాన ట్రస్టుకు విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆదాయం రూ.4.56 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.4,56,789 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. రావులపాలెం నుంచి వాడపల్లికి పాదయాత్రగా గోవిందమాలధారులు, భక్తులు సుమారు వెయ్యి మంది గోవిందనామ స్మరణతో స్వామివారి సన్నిధికి చేరుకుని దర్శించుకున్నారు. గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.3లక్షల విరాళం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.4 కోట్లతో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన దుడ్డుపూడి శ్రీధర్, పద్మజ దంపతులు రూ.3లక్షల విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఈవో స్వామివారి చిత్రపటం అందించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఉయ్యాలసేవ

రావులపాలెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని అలివేలు మంగ పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉయ్యాలసేవ నిర్వహించారు. ఆయా ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి పర్యవేక్షించారు.



రావులపాలెంలో స్వామివారికి ఉయ్యాలసేవ జరుపుతున్న దృశ్యం

ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణం



అంగరలో వేణుగోపాలస్వామి పుష్పోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

కపిలేశ్వరపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు. శనివారం రాత్రి స్వామివారి పుష్పోత్సవాన్ని పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు, పెద్దింటి ప్రసన్నకుమార్ భార్గవాచార్యులు, ఆలయ అర్చకులు ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఈనెల 9న ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు అన్నసమారాధనతో ముగిసినట్టు ఆలయ ఈవో రాంబాబురెడ్డి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి తరాలకు స్ఫూర్తి పొట్టి శ్రీరాములు

కొత్తపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన జయంతిని పురస్కరించుకుని వాడపాలెంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. పలివెల గాంధీ అధ్యయన సంస్థ అధ్యక్షుడు దుళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. జయంతిని పురస్కరించుకుని పలు పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కొత్తపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.శ్రీను, సాదే శ్రీనివాస్, మెర్ల గోపాలం తది తరులతో పాటు ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆయా ప్రాంతాల్లో నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవికి నివాళులర్పించారు. ర్యాలీ, అంకంపాలెం, నార్కెడమిల్లి, ఆత్రేయపురం, వెలిచేరు, పేరవరం, రాజవరం తదితర గ్రామాల్లో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పాలాభిషేకం చేసి ఆర్యవైశ్య ప్రముఖులు నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. మండపేట మండలం ఏడిదలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి లీలాకృష్ణ నివాళులర్పించారు. మండపేట పెద్దకాల్వ వద్ద వున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి, వైశ్య ప్రముఖులు నివాళులర్పించారు.

ఏరియా ఆసుపత్రిలో మంత్రి సుభాష్ ఆకస్మిక తనిఖీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంత్రి సుభాష్ శనివారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం రాత్రి 11.40 గంటల ప్రాంతంలో ఆయన ఏరియా ఆసుపత్రికి చేరుకుని డాక్టర్లు విధుల్లో ఉన్నారా లేదా పరిశీలించారు. సిబ్బంది, వైద్యులు విధుల్లో ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిని తరచూ తనిఖీ చేసే మంత్రి ఈ దఫా అర్ధరాత్రి తనిఖీ చేశారు. శనివారం అర్ధరాత్రి తనిఖీలో ఆయన రోగులకు అందుతున్న సేవలపై ప్రశ్నించారు. ఇటీవల రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేసి కొంత మంది వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే.



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కాంట్రాక్టర్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల కాంట్రాక్టర్లు

రావులపాలెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల బిల్డర్ అసోసియేషన్ సంఘ సభ్యులు కోరారు. రావులపాలెంలోని అసోసియేషన్ భవనంలో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కాంట్రాక్టర్ల సమావేశం జరిపారు. సభలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు గుంతలు లేని రహదారుల కార్యక్రమాన్ని చేపట్టి పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ తాము అప్పులు తెచ్చి రహదారి పనులు పూర్తి చేశామన్నారు. వాటి అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లింపులు కోరుతూ 19న పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపాల్టీ, ఎస్ఈ కార్యాలయాల వద్ద 21న తూర్పుగోదావరి జిల్లాలో ఆయా కార్యాలయాల వద్ద ధర్నా జరిపి వినతిపత్రాలు అందిస్తామన్నారు. నెలఖారులోపు బిల్లులు విడుదల కాకపోతే 1న మరో సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలకు 79 మంది హాజరు

అమలాపురం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలకు 79 మంది హాజరయ్యారు. భట్లపాలెం సెంటర్‌కు 170మంది అభ్యర్థులను కేటాయించగా 91మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

గొల్లపుంత ఆయకట్టు రైతులకు సాగునీటి పాట్లు



ఇంజన్‌తో సాగునీరు తరలిస్తున్న దృశ్యం

మండపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండపేటలోని రామచంద్రుడు డెడికేటెడ్ చానల్ కాల్వనీరులో మున్సిపాల్టీకి చెందిన మురుగునీరు చేరటంతో సాగునీరు కాస్తా మురుగునీరుగా మారిపోతోంది. ఈ కాల్వపై సుమారు 500 ఎకరాలకు పైబడి సాగు జరుగుతోంది. ప్రస్తుతం పంట పొట్టదశకు చేరుకోవటంతో సకాలంలో రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి పంటకాల్వ గురించి సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవటంతో స్థానిక రైతులే తమ పొలాలకు ఇంజన్‌తో సాగునీరు పెట్టుకుంటున్నారు. గుర్రపుడెక్క, వ్యర్థాలతో పేరుకు పోయినా కనీసం వాటిని తీసే నాథుడే కరువయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని వ్యర్థాలతో డెడికేటెడ్ చానల్ నిండిపోవటం వల్ల పొలాలకు గత్యంతరం లేని స్థితిలో ఆ నీటినే పెట్టుకోవల్సి వస్తున్న దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పంటబోదె ద్వారా వంతులవారీ విధానంలో అడ్డుకట్ట వేసుకుని పొలాలను తడుపుకునేం దుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తు న్నారు. ఇప్పటికైనా పంటలు దెబ్బతినక ముందే వాటిని బాగుచేసి పొలాలకు సక్రమంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



సాగునీటి కోసం పంటబోదెను బాగుచేస్తున్న రైతులు

సప్తగోదావరిలో పడి వ్యక్తి మృతి

ద్రాక్షారామ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ సప్తగోదావరిలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తూ పడి ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. ద్రాక్షారామలో యాళ్ల సత్యనారాయణ కొన్నేళ్ల నుంచి స్థానిక హోటళ్లలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా కోళ్ల శ్రీనుకు చెందిన టీకొట్టులో పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యం సేవించి వస్తుండటంతో పనికి రావద్దన్నారు. ఆదివారం ఉదయం సప్తగోదావరిలో స్థానికులు గుర్తించారు. మృతుడి సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో స్థానికుల సహాయంతో అంత్యక్రియలు జరిపారు. సత్యనారాయణ మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడని చెబుతున్నారు. ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్ మాతృమూర్తి అనంతలక్ష్మి(70) ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో మాతృ వియోగంతో బాధపడుతున్న ప్రకాష్‌ను, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, పలువురు నాయకులు పరామర్శించారు.

23న గోదావరి బాలల కథలు పుస్తకావిష్కరణ



ఆలమూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్వర్యంలో చిన్నారులతో రచించిన కథలతో ముద్రించిన గోదావరి బాలల కథలు పుస్తకావిష్కరణను మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా 23న రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు, కవి అంగర గోపాలకృష్ణ(కృష్ణశ్రీ) తెలిపారు. ఆదివారం ఆలమూరులో ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరులో రాజమహేంద్రవరంలో బాలల కథా రచన పోటీలు నిర్వహించామని ఈ పోటీల్లో 200 మంది బాలలు కథలను అందించారన్నారు. వీటిలో 80 మేలైన కథలను ఎంపిక చేసి పుస్తక రూపంలో ప్రచురించామని తెలిపారు. గోదావరి బాలల కథల పుస్తకాన్ని 23న రాజమహేంద్రవరం సంహిత డిగ్రీ కాలేజీ ఆవరణలో మంత్రి దుర్గేష్‌తోపాటు పలువురి చేతుల మీదుగా ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పుస్తకంలో ప్రచురించిన కథలకు రచయితలైన చిన్నారులకు ప్రశంసాపత్రం, బహుమతులతో సత్కరిస్తామని కృష్ణశ్రీ చెప్పారు. కథ పోటీల్లో పాల్గొనే చిన్నారులు పుస్తకావిష్కరణకు హాజరు కావాలన్నారు.

ఎడ్ల పోటీల్లో మరోసారి సత్తాచాటిన గుమ్మిలేరు

ఆలమూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కాపవరంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు రైతు కోరా వీరభద్రరావు మారోసారి సత్తాసాటి బహుమతులు గెలుచుకున్నారు. రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగుల ప్రదర్శన పోటీలు రెండు విభాగాలుగా నిర్వహించగా దీనిలో సీనియర్ విభాగంలో ప్రథమ, తృతీయస్థానాలు, జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానం కోరా వీరభద్రరావు ఎడ్ల జతలు సాధించాయి. విజయం సాధించిన ఆయన్ను పలువురు నాయకులు, గ్రామస్తులు, రైతులు అభినందించారు.



పూడికతీయక వృథాగా మారిన అంకాలమ్మ చెరువు

అంకాలమ్మ చెరువుకు మోక్షమెప్పుడో...?

మండపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం వైఎస్‌నగరం గ్రామ పంచాయతీకి చెందిన అంకాలమ్మ చెరువు స్థానిక రాజకీయనేతల పోరు కారణంగా నాలుగేళ్ల నుంచి పూడికతీతకు నోచుకోకపోవటంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. అంకాలమ్మ చెరువు సుమారు 8ఎకరాల వరకు ఉండేదని ఇప్పుడు చెరువు ఆక్రమణలకు గురికావటం మరోపక్క. చెరువును ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించుకోవటం వంటి కారణాల మధ్య దాని విస్తీర్ణం తగ్గిపోయి ప్రస్తుం ఎకరం మాత్రమే మిగిలింది. గ్రామంలో వున్న అంకాలమ్మ చెరువు వల్ల పంచాయతీకి మత్స్యకారులు చేపలు పెంచుకోవటం ద్వారా ఆదాయం చేకూరేది. ఇప్పుడు నాలుగేళ్ల నుంచి చెరువు తవ్వకపోవటం వల్ల వృథాగా పడి ఉంది. చెరువు వల్ల ఆదాయం రాక మరోపక్క పూడికతీయక పోవటంతో నాలుగేళ్ల నుంచి వృథాగా పడి ఉంది. దీంతలో చెరువులో వ్యర్థాలు పెరిగిపోయి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఉపాధి హామీ పథకంలో పూడిక తీసి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం వేసవికాలం నేపథ్యంలో త్వరలోనే చెరువు పూడికతీత పనులు చేపట్టి దీనిగట్టు బలోపేతం చేస్తామని దీని పూడికతీత పనులు చేసేందుకు అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించామని ఉపాధి హామీ ఏపీఎం సత్యనారాయణ తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాయవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం, కొత్తపేట డివిజన్ల పరిధిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు రామచంద్రపురం, కొత్తపేట ఇన్‌చార్జ్ డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి తెలిపారు. ఆదివారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం డివిజన్ పరిధిలో కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట, రామచంద్రపురం, రాయవరం మండలాలకు చెందిన 4,980 మంది విద్యార్థులు, కొత్తపేట డివిజన్ పరిధిలో అయినవిల్లి, ఆలమూరు, అంబాజీపేట, ఆత్రేయపురం, కొత్తపేట, పి.గన్నవరం, రావులపాలెం మండలాలకు చెందిన 5,417 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. రెండు డివిజన్ల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు, వొకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 10,397 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యాలు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందు హాజరుకావాలన్నారు.

నాలుగు సెంటర్లలో 417 మంది విద్యార్థులు

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు తెలిపారు. కె.గంగవరం మండలంలో పామర్రు, గంగవరం, దంగేరు, కోటిపల్లి సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. మండలంలో పది ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభమయ్యే టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి నెలాఖరు వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణకు 9 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ద్వారపూడి జిల్లా పరిషత్ బాలురు బాలికల హైస్కూల్స్, ఏడిద జిల్లా పరిషత్, తాపేశ్వరం జిల్లా పరిషత్, శ్రీచైతన్య స్కూల్‌తో పాటు మండపేటలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, సెయింట్ ఆన్స్ పాఠశాల, బాష్యం పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పదవ తరగతి ఓపెన్ స్కూల్‌కు సంబంధించి నేటి నుంచి 31 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇందుకోసం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మండపేటలో వున్న బాష్యం స్కూల్, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.



ర్యాలిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయం, వెల్‌నెస్ భవన నిర్మాణం

ప్రారంభించారు...వదిలేశారు

• అసంపూర్తిగా మిగిలిన సచివాలయ భవన నిర్మాణం
• జగన్ ప్రభుత్వంలో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన వైనం

ఆత్రేయపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలు నేటికి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గ్రామంలో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి పాలన అందించాలనే గత ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనాలు అసంపూర్తిగా మిగిలిపోవడంతో అనుకున్న లక్ష్యం నీరుగారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మేజర్ గ్రామమైన ర్యాలీలో రూ.40 లక్షలతో మూడవ సచివాలయ భవనం, పక్కనే రూ.17లక్షల వ్యయంతో వెల్‌నెస్ సెంటర్ భవనాలకు రెండేళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయి. ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. స్లాబ్ లెవెల్ వరకూ వాటి పనులు చేసి అలాగే వదిలేశారు. అప్పట్లో ఆలస్యమైనా చేసిన పనికి బిల్లులు వచ్చాయి. ప్రభుత్వం మారడంతో వాటి పనులు చేయకుండానే కాంట్రాక్టర్లు వెళ్లిపోయారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి వాటి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు

భీమేశ్వరాలయంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు పూజలు

ద్రాక్షారామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఆదివారం కేంద్ర మాజీమంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు దర్శించుకున్నారు. భీమేశ్వరస్వామివారి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనఅనంతరం పల్లంరాజుకు వేదపండితులు ఆశీర్వచనం అందచేశారు.



మృతురాలి ఫ్లెక్సీతో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు

ద్రాక్షారామలో ట్రావెల్స్ బస్సు ఆపి ఆందోళన

ద్రాక్షారామ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండు చేస్తూ జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలు ఆదివారం రాత్రి ద్రాక్షారామలో ప్రైవేటు ట్రావెలర్స్ బస్సు ఆపి ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల ఏలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్న కాజులూరుకు చెందిన జుత్తుకభవానీ మృతి చెందగా ద్రాక్షారామకు చెందిన మరొక వ్యక్తి గాయపడ్డారు. బాధిత కుటుంబాలకు వాటి యాజమాన్యం నష్టపరిహారం చెల్లించలేదు. దీంతో ఆదివారం రాత్రి యానాం నుంచి హైదరాబాద్ వెళుతున్న రమణ ట్రావెలర్స్ బస్సును యానం సెంటర్‌లో నిలిపి వేశారు. అప్పటి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జుత్తుక భవానీ ఫ్లెక్సీతో బస్సును అడ్డుకుని ఆందోళన చేపట్టారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ కన్వీనర్ దూడల శంకరనారాయణ ఆధ్వర్యంలో జనసైనికులు, బాధిత కుటుంబాలు ఆందోళన జరిపారు. బస్సులో ప్రయాణికులను దించివేశారు. ఆందోళన సమయంలో బస్సులో మద్యం బాటిల్ లభ్యం కావడంతో డ్రైవర్లు మద్యం సేవించి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బాధిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు ప్రైవేటు బస్సును కోటిపల్లి రోడ్డులోని దేవస్థానం వసతిగృహాల వద్దకు తరలించారు. యాజమాన్యం వచ్చి సమాధానం చెబితే బస్సు వదులుతామని వారు తెలిపారు.



ఏడిదలో జనసేన జెండాను ఆవిష్కరిస్తున్న లీలాకృష్ణ

జనసేన జెండా ఆవిష్కరణ

మండపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ఏడిద గ్రామంలో జనసేన జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. జనసైనికులకు అండగా ఉంటానని చెప్పారు. ముందుగా ఏడిదలో వున్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రామిశెట్టి రాజా, సరాకుల అబ్బులు, కుంచే దుర్గాప్రసాద్, కూటమి నాయకులు వున్నారు.

ఓఎన్జీసీపై 14వ రోజు నిరసన పోరు

అల్లవరం మార్చి 16(ఆంధ్రజ్యోతి): అపారమైన చమురు నిక్షేపాల్లో భారతదేశంలోనే అగ్రగామిగా ఉన్న ఓడలరేవు గ్రామాభివృద్ధి పట్ల ఓఎన్జీసీ అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గ్రామస్తులు 14వ రోజున ఆదివారం రిలే దీక్ష కొనసాగించారు. ఓఎన్జీసీ స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. 14రోజులుగా దీక్షలు చేస్తున్నా ఓఎన్జీసీ అధికారులు స్పందించకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓడలరేవు గ్రామ దత్తత, గ్రామ యువతకు ఓఎన్జీసీ టెర్మినల్‌లో ఉపాధి కల్పించాలని, ఓడలరేవు గ్రామాన్ని సముద్ర కోత బారి నుంచి రక్షించాలని, ఓడలరేవును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న పలు డిమాండ్లతో గ్రామస్తులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, పెమ్మాని వెంకటరామారావు, మందపాటి రామకృష్ణ, గండుమేను శ్రీనివాస్, తోటే వెంకటేశ్వరరావు, రేకాడి శేషగిరి దీక్షల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పచ్చిమాల ఏడుకొండలు, జనసే నాయకులు కంకిపాటి వీరబాబు, పిండి గణపయ్య, నల్లా రాము తదితరులు ఓడలరేవు గ్రామస్తుల దీక్షలకు సంఘీభావం తెలిపారు.

బీజేపీ నూతన అధ్యక్షుడి ఎన్నిక



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న నాయకులు

కె.గంగవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల నూతన అధ్యక్షుడి ఎన్నిక అముజూరు గ్రామంలో ఆదివారం జరిగింది. పామర్రు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి చంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తలాటం వెంకట రమణ, అబ్జర్వర్‌గా చాట్రాది రాంబాబు వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రరావును మాజీ అధ్యక్షుడు అవసరాల వెంకట రమణమూర్తి పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకూ పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన రమణమూర్తి సేవలను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సలాది శేఖర్, గుర్రాల సత్యనారాయణ, దోమ ఆదినారాయణ, నున్న సత్యనారాయణ, పసుమర్తి మణికంఠ, కాదా వీరవెంకట రమణ, దంగేటి చంద్రరావు, కె.హేమదుర్గ, టి.మునలయ్య, వరసాల కృపారావు తదితరులు పాల్గొన్నారు.